‘పాలమూరు’పై నిర్లక్ష్యమెందుకు?

- బీఆర్ఎస్ హయాంలో 90% పూర్తి
- 10% పనులపై సర్కార్ జాప్యం
- పాలమూరు సాగునీటి ప్రాజెక్టులను పండబెట్టిందే కాంగ్రెస్
- రేవంత్‌రెడ్డి సర్కార్‌పై మాజీ ఎమ్మెల్యేలు ధ్వజం
- 14 నెలలకే ఎగిరెగిరి పడొద్దు: ఆల
- సెటిల్‌మెంట్లు చేస్తున్న రేవంత్ సోదరులు : పట్నం నరేందర్‌రెడ్డి
- సీఎం హోదాను దిగజారుస్తున్న రేవంత్: గువ్వల బాలరాజు

తెలంగాణ భవన్‌లో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి. చిత్రంలో పట్నం నరేందర్‌రెడ్డి, గువ్వల బాలరాజు తదితరులు

హైదరాబాద్, జనవరి 28 (నమస్తే తెలంగాణ): బీఆర్ఎస్ హయాంలోనే 90% పూర్తయిన పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టును కాంగ్రెస్ సర్కార్ ఎందుకు పట్టించుకోవడం లేదని బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యేలు ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, పట్నం నరేందర్‌రెడ్డి, గువ్వల బాలరాజు ప్రశ్నించారు. ప్రాజెక్టును పూర్తిచేస్తే కేసీఆర్‌కు పేరు వస్తుందని రేవంత్‌రెడ్డి భావిస్తున్నారా? అని నిలదీశారు. ఉమ్మడి రాష్ట్రంలో పాలమూరు ప్రాజెక్టులను పండబెట్టిందే కాంగ్రెస్ పార్టీ అని ధ్వజమెత్తారు. హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో మంగళవారం వారు మీడియాతో మాట్లాడారు. బీఆర్ఎస్ హయాంలో ప్రాజెక్టుల వద్దే ఉండి యుద్ధప్రాతిపదికన పనులు పూర్తిచేశామని ఆల వెంకటేశ్వర్‌రెడ్డి గుర్తుచేశారు. కేసీఆర్ సీఎం అయ్యాకే పాలమూరు జిల్లాకు నీళ్లొచ్చాయని చెప్పారు. ప్రజల కోణంలో కాంగ్రెస్ పాలన సాగించడం లేదని విమర్శించారు. 14 నెలలకే ఎగిరెగిరి పడొద్దని హితవు పలికారు. పాలమూరు జిల్లాను అభివృద్ధి చేసే అవకాశం రేవంత్‌రెడ్డికి వచ్చిందని, దానిని వినియోగించుకోవాలని సూచించారు. ఇచ్చిన ఆరు గ్యారెంటీలను పూర్తిగా పక్కన పెట్టారని, 14 నెలల కాలంలో దేవరకద్రలో ఒక్క అభివృద్ధి పని జరుగలేదని విమర్శించారు. తాము చేసిన శంకుస్థాపనలకే మళ్లీ శంకుస్థాపనలు చేస్తున్నారని చెప్పారు. ఏడాది పాలనలో విఫలమైనందునే గ్రామసభల్లో అధికార పార్టీ ఎమ్మెల్యేలపై ప్రజలు తిరగబడ్డారని తెలిపారు. అదృష్టంతోనే పాలమూరులో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు గెలిచారని ఎద్దేవా చేశారు.

రేవంత్ అండతో కొడంగల్‌లో దందాలు

కొడంగల్ నియోజకవర్గంలో సీఎం రేవంత్‌రెడ్డి సోదరులు సెటిల్‌మెంట్లు చేస్తున్నారని మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి విమర్శించారు. రేవంత్ అండ చూసుకొని ఇసుక, భూదందాలకు పాల్పడుతున్నారని ధ్వజమెత్తారు. సీఎం రేవంత్‌రెడ్డి పాల్గొన్న కోస్గి సభ అట్టర్‌ఫ్లాప్ అయిందని చెప్పారు. 26వ తేదీనే రైతు భరోసా చెల్లిస్తామని చెప్పిన రేవంత్‌రెడ్డి.. మళ్లీ మాటతప్పి మార్చి నెలాఖరు నాటికి వేస్తామని మోసం చేశారని ఆగ్రహం వ్యక్తంచేశారు. స్థానిక సంస్థల ఎన్నికల స్టంట్ కోసమే రేషన్ కార్డులు అంటుకున్నారని విమర్శించారు. కొడంగల్ నియోజకవర్గంలో తాను అవినీతి చేసినట్టు నిరూపిస్తే దేనికైనా సిద్ధమేనని సవాల్ విసిరారు. తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు కొడంగల్ నియోజకవర్గంలో మూడు దవాఖానలు నిర్మించామని, 90 శాతం రోడ్ల నిర్మాణాలు పూర్తిచేశామని గుర్తుచేశారు. దావోస్ పెట్టుబడులను కొడంగల్‌కు తీసుకొచ్చి అభివృద్ధి చేయాలని సూచించారు.

సీఎం హోదాను దిగజార్చొద్దు

నోటికొచ్చినట్టు మాట్లాడి ముఖ్యమంత్రి హోదాను దిగజార్చొద్దని మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు సీఎం రేవంత్‌రెడ్డికి హితవు పలికారు. మాజీ సీఎం కేసీఆర్‌పై రేవంత్‌రెడ్డి అడ్డగోలుగా మాట్లాడటం తగదని పేర్కొన్నారు. ఎవరిది కుటుంబ పాలనో ప్రజలకే తెలుసని తెలిపారు. కేటీఆర్, కవిత సహా ప్రజల చేత ఎన్నికై ప్రజాక్షేత్రంలోకి వచ్చారని చెప్పారు. ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తూ ఎలాంటి పదవులు లేకపోయినా సీఎం సోదరుడు తిరుపతిరెడ్డికి ప్రొటోకాల్ ఇస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. తిరుపతిరెడ్డికి నామినేటెడ్ పోస్టు ఇచ్చినా తమకు అభ్యంతరం లేదని చెప్పారు. సమావేశంలో బీఆర్ పార్టీ నేతలు నర్సింహనాయక్, నారాయణరెడ్డి పాల్గొన్నారు.

84 మంది విద్యార్థులకు అస్వస్థత

- కందుకూరు గురుకులంలో ఫుడ్ పాయిజన్
- ఆలస్యంగా వెలుగులోకి.. బయటకు రాకుండా జాగ్రత్తలు
- గేటుకు తాళాలు.. తల్లిదండ్రుల అడ్డగింత

బడంగ్‌పేట, జనవరి 28: రంగారెడ్డి జిల్లా నాదర్‌గుల్‌లోని కందుకూరు గురుకులంలో ఫుడ్ పాయిజన్ అయింది. దీంతో 84 మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. వాంతులు, విరేచనాలు, కడుపు నొప్పితో మంచం పట్టారు. అయితే, ఈ విషయాన్ని ప్రిన్సిపల్ తొక్కిపెట్టారు. బయటకు పొక్కకుండా విద్యార్థులను బెదిరించినట్టు ఆరోపణలు వస్తున్నాయి. తల్లిదండ్రులు, విద్యార్థులు తెలిపిన వివరాల ప్రకారం.. జనవరి 26న గణతంత్రం దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు స్వీట్లు వడ్డించారు. వాటిని తిన్న విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. హాస్టల్‌లోనే నర్సు సాయంతో వైద్యం చేయించేందుకు ప్రిన్సిపల్ ప్రయత్నించారు. ఈ క్రమంలో కొంత మంది పరిస్థితి సీరియస్ కావడంతో వనస్థలిపురం ఏరియా దవాఖానకు తరలించగా విషయం బయటపడింది.

తల్లిదండ్రుల ఆగ్రహం

విషయం తెలుసుకున్న విద్యార్థులు తల్లిదండ్రులు వెంటనే గురుకులానికి వెళ్లగా వారిని ప్రిన్సిపల్ అడ్డుకున్నారు. గేటుకు తాళం వేశారు. పోలీసులను పిలిపించారు. ఆఖరికి తల్లిదండ్రులను లోపలికి అనుమతించారు. విద్యార్థులు అస్వస్థతకు గురైనా కనీస సమాచారం ఇవ్వకపోవడంపై తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కొంతమంది తమ పిల్లలను ఇండ్లకు తీసుకెళ్లారు. నర్సుతో వైద్యం చేయించామని ప్రిన్సిపల్ చెప్తున్నా.. విద్యార్థులు మాత్రం డాక్టర్లు వచ్చారని చెబుతున్నారు. ప్రస్తుతం విద్యార్థులంతా సురక్షితంగా ఉన్నట్టు ప్రిన్సిపల్ తెలపగా.. ప్రిన్సిపల్ తీరుపై తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు. చాలామంది పూర్తిగా కోలుకోలేదని, నిరుడు ఓ విద్యార్థి ఆత్మహత్య చేసుకోగా ఆ విషయాన్ని గోప్యంగా ఉంచారని వారు మండిపడుతున్నారు. ఫుడ్ పాయిజన్ ఘటనలు అనేకసార్లు జరిగాయని, బయటకు రాకుండా తొక్కిపెడుతున్నారని ఆరోపిస్తున్నారు. హాస్టల్‌లో వసతులు సరిగా లేవని, ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని పేరెంట్స్ కమిటీ అధ్యక్షుడు చంద్రశేఖర్ తెలిపారు.

బెయిల్ మంజూరుతో జైలు నుంచి బయటకు వచ్చిన సురేశ్

లగచర్ల కేసులో బెయిల్‌పై సురేశ్ విడుదల

- 80 రోజుల తర్వాత విముక్తి
- వేరే కేసులో అరెస్టు చేయరాదని హైకోర్టు ఆదేశం

నాంపల్లి క్రిమినల్ కోర్టులు, జనవరి 28 (నమస్తే తెలంగాణ): లగచర్ల రైతులపై పోలీసులు నమోదు చేసిన కేసులో 80 రోజుల నుంచి రిమాండ్ ఖైదీగా ఉన్న రెండో ముద్దాయి సురేశ్‌కు జైలు నుంచి విముక్తి లభించింది. ఈ కేసులో ప్రత్యేక పీడీపీపీ కోర్టు ఇటీవల సురేశ్‌కు షరతులతో కూడిన బెయిల్ ఇచ్చింది. మరోవైపు క్రైమ్ నంబర్ 154, 155 కేసులో ఆయనను అరెస్టు చేయరాదని హైకోర్టు పోలీసులను ఆదేశించింది. ఈ నేపథ్యంలో సురేశ్ రూ.50 వేల చొప్పున ఇద్దరి పూచీకత్తులను మంగళవారం కోర్టుకు సమర్పించారు. అనంతరం కోర్టు ఉత్తర్వుల మేరకు ఆయన చంచల్‌గూడ జైలు నుంచి విడుదలయ్యారు. సురేశ్ కుటుంబసభ్యులు హర్షం వ్యక్తంచేశారు. సురేశ్ వారానికోసారి బొంరాస్‌పేట పోలీసుల ఎదుట హాజరుకావాల్సి ఉంది. ఈ కేసులో కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డితోపాటు 36 మంది రైతులు ఇప్పటికే విడుదలైన విషయం తెలిసిందే.

తెలంగాణ సంస్కృతికి ప్రతీక నాగోబా

ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

హైదరాబాద్, జనవరి 28 (నమస్తే తెలంగాణ): ఆదివాసీల అతిపెద్ద జాతర నాగోబా.. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయ వైభవానికి ప్రతీక అని ఎమ్మెల్సీ కవిత అభివర్ణించారు. ఈ మహా పండుగ ప్రారంభమవుతున్న శుభవేళ ఆదివాసులకు శుభాకాంక్షలు తెలుపుతూ మంగళవారం ఎక్స్‌లో ట్వీట్ చేశారు. ఆ ఆదిశేషువు ఆశీస్సులు ప్రతి ఒక్కరిపై ఉండాలని ఆకాంక్షించారు.

కేసు లేకుండా చేసేందుకు 3 లక్షలు

ఏసీబీకి చిక్కిన తిరుమలగిరి ఎస్ఐ, కానిస్టేబుల్

తిరుమలగిరి, జనవరి 28 : సూర్యాపేట జిల్లా తిరుమలగిరి ఎస్ఐ, కానిస్టేబుల్ ఏసీబీకి చిక్కారు. వివరాల్లోకి వెళ్తే.. తుంగతుర్తి పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ నెల 12న సిద్దిపేట జిల్లా వడ్డేపల్లికి చెందిన రత్నాకర్ వాహనంలో పీడీఎస్ బియ్యం తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. రత్నాకర్ పారిపోవడంతో అతడి అన్న, మాజీ సర్పంచ్ చంద్రశేఖర్‌పై కేసు నమోదు చేశారు. కేసు లేకుండా చేయడానికి ఎస్ఐ ఉక్కుర్తి సురేశ్ 3 లక్షలు లంచం డిమాండ్ చేసి, ఈ నెల 25న ఫోన్‌పే ద్వారా 40వేలు తీసుకున్నారు. మరిన్ని డబ్బులు డిమాండ్ చేయడంతో చంద్రశేఖర్ ఏసీబీని ఆశ్రయించారు. మంగళవారం ఎస్ఐ సురేశ్.. కానిస్టేబుల్ నాగరాజు ద్వారా రూ.లక్ష లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. వీరిని కోర్టులో హాజరుపర్చనున్నట్టు ఏసీబీ డీఎస్పీ జగదీశ్‌చంద్ర తెలిపారు.

ఏసీబీ అధికారులకు చిక్కిన ఎస్ఐ సురేశ్, కానిస్టేబుల్ నాగరాజు

5 వరకు హరీశ్‌రావును అరెస్టు చేయొద్దు

- పోలీసులకు హైకోర్టు ఆదేశం
- రాజకీయ కుట్రతోనే తప్పుడు కేసు
- ఆధారాల్లేని కేసును కొట్టివేయాలి
- హైకోర్టులో హరీశ్‌రావు అఫిడవిట్

హైదరాబాద్, జనవరి 28 (నమస్తే తెలంగాణ): ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో మాజీ మంత్రి, బీఆర్ఎస్ సిద్దిపేట శాసనసభ్యుడు టీ హరీశ్‌రావుపై నమోదైన కేసులో ఆయనను ఫిబ్రవరి 5వ తేదీ వరకు అరెస్టు చేయరాదని హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో జారీచేసిన ఉత్తర్వులను మంగళవారం జస్టిస్ కే లక్ష్మణ్ మరోసారి పొడిగించారు. రియల్ ఎస్టేట్ వ్యాపారి చక్రధర్‌గౌడ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పంజాగుట్ట పీఎస్‌లో తనపై నమోదైన ఫోన్‌ట్యాపింగ్ కేసును కొట్టివేయాలంటూ హరీశ్‌రావు దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ లక్ష్మణ్ విచారణ చేపట్టారు. గతంలో ఏసీపీ వేసిన కౌంటర్ పిటిషన్‌పై హరీశ్‌రావు అఫిడవిట్ దాఖలు చేయగా, దానిపై వాదనలు వినిపించడానికి కొంత గడువు కావాలని పబ్లిక్ ప్రాసిక్యూటర్ పల్లె నాగేశ్వరావు కోరారు. ఇందుకు అనుమతించిన న్యాయమూర్తి తదుపరి విచారణను ఫిబ్రవరి 5వ తేదీకి వాయిదా వేశారు.



రాజకీయ లబ్ధి కోసమే కేసు: హరీశ్

రాజకీయ లబ్ధి కోసమే చక్రధర్‌గౌడ్ తనపై పోలీసులకు తప్పుడు ఫిర్యాదు చేశాడని హరీశ్‌రావు కోర్టుకు సమర్పించిన అఫిడవిట్‌లో పేర్కొన్నారు. ఫోన్ ట్యాపింగ్ చేయించానంటూ తనపై చేసిన ఆరోపణలకు ఆధారాలు లేవని తెలిపారు. తన రాజకీయ ప్రత్యర్థుల అండతో వ్యక్తిగతంగా లబ్ధి పొందాలనే కుట్రతోనే ఈ కేసు పెట్టారని ఆరోపించారు. చక్రధర్‌గౌడ్‌పై లైంగిక దాడి, కిడ్నాప్‌వంటి కేసుల్లో ఆరోపణలు ఉన్నాయని తెలిపారు. ఉద్యోగాలు ఇప్పిస్తామని వేలమందిని మోసం చేశాడని తెలిపారు. ఆయనపై ఏకంగా 11 కేసులు నమోదయ్యాయని పేర్కొన్నారు. అక్రమార్జనతో రాజకీయంగా ఎదగాలన్న ఆయన కుటిల ప్రయత్నాలను ప్రజలు తిరస్కరించారని తెలిపారు. చక్రధర్ తొలుత బీజేపీలో ఎమ్మెల్యే టికెట్ ఆశించి భంగపడ్డాడని, ఆ తర్వాత బీఎస్పీలో చేరి తనపై సిద్దిపేట నుంచి పోటీచేశారని పేర్కొన్నారు. అయితే ప్రజలు ఆయనను చిత్తుగా ఓడించారని తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రాగానే, చక్రధర్ ఆ పార్టీలో చేరి సీఎం రేవంత్‌రెడ్డి అండదండలతో తనపై తప్పుడు ఫిర్యాదు చేశారని వివరించారు. సీఎం అండతోనే తన ప్రతిష్ఠను దెబ్బతీయడానికి లేనిపోని అభియోగాలతో కేసు నమోదు చేశాడని ఆరోపించారు. ఎలాంటి ఆధారాలు లేకపోయినప్పటికీ పోలీసులు ప్రాథమిక విచారణ కూడా చేయకుండానే కేసు నమోదు చేశారని తెలిపారు. ఆధారాలు లేకుండా పెట్టిన కేసును కొట్టివేయాలని కోరారు.

తెలంగాణ భవన్‌లో మీడియా సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్. చిత్రంలో ఎమ్మెల్యే ముఠా గోపాల్ తదితరులు

కేసు పెట్టాల్సింది సీఎంపైనే!

> మొదటిపేజీ తరువాయి...

లక్షలాది మందికి ఉద్యోగాలు కల్పించాలన్న సంకల్పంతో ఫార్ములా ఈ రేస్ నిర్వహించింది. ఆ రేసు ఇంకా నాలుగుసార్లు జరగాల్సి ఉండె. కానీ, సీఎం రేవంత్‌రెడ్డి అనాలోచితంగా ఒప్పందం రద్దు చేసుకున్నారు. ఫలితంగా ఈవీ మొబిలిటీ వ్యాలీ రాకుండా పోయింది. పన్నులు చెల్లించే పౌరుడిగా నాకు నష్టం జరిగింది. తెలంగాణ ప్రజలకు నష్టం జరిగింది. వేలాది ఉద్యోగాలు వచ్చే అవకాశం పోయింది. ఇందుకు కారణం ముఖ్యమంత్రి. అందుకే ఈ కేసులో ముందు రేవంత్‌రెడ్డిని కూడా ప్రశ్నించాలి’ అని ప్రవీణ్‌కుమార్ డిమాండ్ చేశారు. రాజకీయ కక్షతో ప్రతిపక్షాలను ఇబ్బంది పెట్టడం, అవినీతి జరిగిందని ప్రజలకు అబద్ధాలు చెప్పి, వేల మంది నిరుద్యోగులకు అన్యాయం చేసిన రేవంత్‌పై చర్యలు తీసుకోవాలని కోరారు.

ఆ పథకాలను కేసీఆర్ రద్దుచేయలేదు

కేసీఆర్ పదేండ్ల పాలనలో ఏనాడూ ఉమ్మడి రాష్ట్రంలో నాటి ముఖ్యమంత్రులు తెచ్చిన ప్రజా ప్రయోజన పథకాలను రద్దు చేయలేదని ప్రవీణ్‌కుమార్ గుర్తుచేశారు. కానీ, రేవంత్‌రెడ్డి రద్దుచేస్తూ పోవడం రాష్ట్ర భవిష్యత్తుకు ప్రమాదకరమని మండిపడ్డారు. రాజ్యాంగబద్ధంగా పరిపాలిస్తానని ప్రమాణం చేసిన సీఎం రేవంత్‌రెడ్డి నేడు తన సోదరులకు అధికార లాంఛనాలతో స్వాగతం పలుకుతూ రాచమర్యాదలు చేయిస్తున్నారని విమర్శించారు. తన మంత్రివర్గ సభ్యుడు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి చెందిన రాఘవ కన్‌స్ట్రక్షన్స్ కంపెనీతో ఒప్పందాలు చేసుకుంటున్నారని ఫైరయ్యారు. హోం మంత్రి, సీఎం అని రేవంత్‌రెడ్డిపై కేసులు పెట్టకుండా చూడొద్దని పోలీసులను కోరారు. ఆర్టికల్ 14 ప్రకారం చట్టం ముందు అందరూ సమానమే అనే నిబంధనను మరువవద్దని, మీరు పట్టించుకోకపోతే న్యాయస్థానం ఉన్నదనే విషయం మరువవద్దని హితవుపలికారు. సమావేశంలో అభిలాష్, విజయ్‌కుమార్, విజయ ఆరియా పాల్గొన్నారు.

ఫిర్యాదులోని ముఖ్యాంశాలు

- ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి, మున్సిపల్ పరిపాలనశాఖ మంత్రితో చేసిన నమ్మకద్రోహం, ప్రజల సొమ్ముకు భారీ నష్టం కలిగించిన ఘటనపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి.
- నేను డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్, భారత పోలీస్ సేవ (IPS) రిటైర్డ్ అధికారి. నేను తెలంగాణ రాష్ట్రానికి చెందిన రాయదుర్గం, బండ్లగూడజాగీర్ మునిసిపాలిటీ పరిధి స్నేహితాహిల్స్‌లోని స్టోన్‌హెంజ్ అపార్టుమెంట్స్‌లో నివసిస్తున్నా. నేను ఏపీ, తెలంగాణ రాష్ట్రాల్లో, దేశానికి అనేక ఉద్యోగ బాధ్యతలతో సేవలందించాను.
- ఇటీవలి కాలంలో తెలంగాణ రాష్ట్రానికి సంబంధించిన ఫార్ములా ఈ-రేస్ నిర్వహణను రద్దు చేయడం ద్వారా రాష్ట్రానికి రూ.55 కోట్ల నష్టం కలిగిందని తేలింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ తక్షణ నిర్ణయం రాష్ట్ర ప్రతిష్ఠను దెబ్బతీసి, భారీ ఆర్థిక నష్టానికి కారణమైంది. ఈ ఘటనపై సమగ్ర విచారణ చేయాల్సిన అవసరం ఉన్నది.
- 2023 ఫిబ్రవరి 11న హైదరాబాద్ నగరం ఫార్ములా ఈ-రేస్ నిర్వహించి, దేశంలో మొట్టమొదటిసారిగా ఈ ఘనతను సాధించింది. ఇది రాష్ట్రానికి పెద్ద మొత్తంలో ఆదాయం తెచ్చింది. కానీ, 2024 జనవరి 7న ఎఫ్ఈవో అధికారికంగా రౌండ్-4 (సీజన్-10) రద్దు చేస్తున్నట్టు ప్రకటించింది. ఈ పరిస్థితికి ప్రధాన కారణం సీఎం రేవంత్‌రెడ్డి తీసుకున్న తప్పుడు నిర్ణయమే.
- ఫార్ములా ఈ-రేస్ కొనసాగించినట్టయితే యువతకు వేల ఉద్యోగాలు, కోట్ల ఆదాయం తెచ్చిపెట్టేది. కానీ, రద్దు వల్ల రాష్ట్ర ప్రతిష్ఠ మసకబారి, ఇతర రాష్ట్రాలకు ఈ అవకాశాలు తరలిపోయాయి. సీఎం చర్య నమ్మకద్రోహానికి ఉదాహరణగా నిలిచింది.
- సంప్రదించిన సమాచారం ప్రకారం ఈ నిర్ణయం సరిగా పరిశీలన లేకుండా తీసుకున్నది. ఇది వ్యక్తిగత కక్షతో రాష్ట్రానికి హాని కలిగించింది. ముఖ్యమంత్రి తీసుకున్న చర్యల వల్ల రాష్ట్రం నష్టపోయింది.
- ఈ వ్యవహారంపై క్రిమినల్ కేసు నమోదు చేసి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై, ఇతర సంబంధితులపై దర్యాప్తు చేపట్టాలని పోలీస్‌శాఖకు మనవి.

మంత్రి పొంగులేటికి బుద్ధిచెప్తం

- బాధ్యతాయుత హోదాలో ఉండి ఓ కలెక్టర్‌పై అనుచిత వ్యాఖ్యలా?
- పునరావృతమైతే తీవ్రపరిణామాలు
- మీ స్వార్థ రాజకీయాలకు మమల్ని బలిచేస్తరా?
- ఆ మాటలను వెనక్కి తీసుకోవాలి
- లేదంటే మా మద్దతు మీకు ఉండదు
- మంత్రిపై ఉద్యోగుల జేఏసీ ఆగ్రహం

కరీంనగర్ టీఎన్జీవో భవన్‌లో సమావేశమైన ఎంప్లాయీస్ జేఏసీ నేతలు

కరీంనగర్, జనవరి 28 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : కరీంనగర్ జిల్లా కలెక్టర్ పమేలా సత్పతిపై ఇటీవల మంత్రి పొంగులేటి చేసిన వ్యాఖ్యలపై కరీంనగర్ ఎంప్లాయీస్ జేఏసీ మండిపడింది. ఐఏఎస్‌లను, అధికారులను, ఉద్యోగులను ఎవరైనా పరుష పదజాలంతో మాట్లాడినా, అవమాన పరిచినా తగిన బుద్ధి చెప్తామని హెచ్చరించింది. ‘కలెక్టర్ మనస్సు చివుక్కుమనేలా కన్నీరు పెట్టించిన ఎవరికైనా మా ఉద్యోగుల శాపం తగులుతది.. మా సహనాన్ని పరీక్షించొద్దు.. మేము తలుచుకుంటే ఏ ప్రజాప్రతినిధి ఏం చేస్తున్నడో సవివరంగా ప్రజలకు వివరించే సత్తా మా ఉద్యోగులకు మాత్రమే ఉన్నదన్న విషయాన్ని గుర్తు పెట్టుకోవాలి’ అని తేల్చిచెప్పింది. ఇటీవల కలెక్టర్ పమేలా సత్పతి విషయంలో మంత్రి పొంగులేటి మాట్లాడిన తీరును నిరసిస్తూ కరీంనగర్ జిల్లా ఉద్యోగ సంఘాల జేఏసీ కరీంనగర్‌లోని టీఎన్జీవో భవన్‌లో మంగళవారం సమావేశమైంది. జేఏసీ చైర్మన్ దారం శ్రీనివాస్‌రెడ్డి ఒక ప్రతికా ప్రకటనలో మంత్రి తీరుపై ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతమైతే జరిగే పరిణామాలకు ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. ప్రస్తుతం కరీంనగర్ జిల్లా కన్నీరు పెడుతున్నదని, ప్రజాస్వామ్యవాదులు, ప్రభుత్వ ఉద్యోగులు బాధపడుతున్నారని, స్వార్థ రాజకీయ క్రీడలకు ప్రభుత్వోద్యోగులను బలిచేయొద్దని అసహనం వ్యక్తంచేశారు. ఎక్కడ నలుగురు ప్రభుత్వోద్యోగులు, ప్రజాస్వామికవాదులు, మేధావులు, ప్రొఫెసర్లు గుమిగూడినా ‘మా జిల్లా కలెక్టర్ చేసిన తప్పేమిటి?’ అని మదనపడుతున్నారని, ఇంత జరిగినా ఉద్యోగ సంఘ నాయకులుగా మీరేం చేస్తున్నారంటూ తమను ప్రశ్నిస్తున్నారని వాపోయారు. ఉద్యోగులందరినీ కలుపుకొనిపోతూ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ప్రతి పథకాన్నీ ప్రజల్లోకి తీసుకుపోయి సమర్థంగా అమలు చేస్తూ కరీంనగర్ జిల్లాను అభివృద్ధి పథంలో నడిపిస్తున్న కలెక్టర్ పమేలా సత్పతిపై అనాలోచితంగా మాట్లాడటం సరికాదని హితవు పలికారు. ఉద్యోగులపై పరుష పదజాలంతో విరుచుకుపడటం పదవిలో ఉన్న వారికి తగదని, తమ ఉద్యోగులంతా అభద్రత.. భయంతో ఉన్నారని పేర్కొన్నారు.

ఆ మాటలు వెనక్కి తీసుకోవాలి

రాత్రింబవళ్లు కష్టపడి అలుపెరగకుండా కృషిచేసి ఎన్నో పోటీ పరీక్షలను ఎదుర్కొని ఈరోజు ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లుగా బాధ్యతాయుతమైన ఉద్యోగ ధర్మం నిర్వహిస్తున్నారని శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. కలెక్టర్‌పై మాట్లాడిన మాటలను వెనక్కి తీసుకోవాలని, లేదంటే భవిష్యత్తులో తమ మద్దతు మంత్రికి ఉండదంటూ తేల్చిచెప్పారు. ‘ప్రజలు, ప్రభుత్వోద్యోగుల విశ్వాసం ఉన్నంతవరకే మీరు ప్రజాప్రతినిధులుగా కొనసాగుతారు. ప్రభుత్వోద్యోగులు రేపు పై స్థాయి అధికారులు అవుతరు.. ఐఏఎస్‌లు ప్రిన్సిపల్ సెక్రటరీలు, చీఫ్ సెక్రటరీలు అవుతరు.. ప్రజల విశ్వాసం కోల్పోయిన రోజు మీరు మళ్లీ వచ్చి మా ఉద్యోగులు, ఐఏఎస్ అధికారుల అపాయింట్మెంట్ కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితులు వస్తయి.. చరిత్ర అందరికీ గుణపాఠం చెప్తది’ అని హితవుపలికారు. ‘ఉద్యోగులుగా మేము ప్రజలకు జీతగాళ్లం.. ప్రజలకు జవాబుదారీగా పనిచేస్తం. మీ రాజకీయ క్రీడ కోసం మా ఉద్యోగులను బలి చేయొద్దు.. రాజకీయాల్లోకి లాగొద్దు’ అని సూచించారు. ఈ విషయాన్ని రాష్ట్ర జేఏసీ దృష్టికి సోమవారం తీసుకెళ్లినట్టు వివరించారు. రాష్ట్ర ఎంప్లాయీస్ జేఏసీ చైర్మన్ మారం జగదీశ్వర్, సెక్రటరీ జనరల్ ఏలూరి శ్రీనివాస్‌రావు, టీఎన్జీవో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్ఎం హుస్సేని (ముజీబ్) మాట్లాడారని, ఇలాంటి చర్యలు పునరావృతం కాకూడదని, అలా జరిగితే ఉద్యోగుల ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారని తెలిపారు. సమావేశంలో టీఎన్జీవోల సంఘం అధ్యక్షుడు దారం శ్రీనివాస్ రెడ్డి, కార్యదర్శి సంగెం లక్ష్మణ్ రావు, టీజీవో అధ్యక్షుడు మడిపేల్లి కాళి చరణ్, కార్యదర్శి అరవింద్ రెడ్డి, డీడీ నాగరాజు, కేంద్ర సంఘం ఉపాధ్యక్షుడు నాగుల నరసింహ స్వామి, అసోసియేట్ అధ్యక్షుడు వొంటెల రవీందర్ రెడ్డి, కోశాధికారి కిరణ్ కుమార్ రెడ్డి, నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు కోట రామస్వామి, కార్యదర్శి శంకర్, మహిళా జేఏసీ చైర్మన్ శారద, డ్రైవర్ల సంఘం అధ్యక్షుడు మంజీత్ సింగ్, ఎండీ వారిస్ సవాబ్, టౌన్ అధ్యక్షులు మారుపాక రాజేశ్ భరద్వాజ్, కార్యదర్శి సుమంత్ రావు, తిమ్మాపూర్ అధ్యక్షుడు పోలు కిషన్, పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు కేశవరెడ్డి కార్యదర్శి లింగయ్య నాయకులు సబిత, సునీతా, విజయ లక్ష్మి, మల్క రాజేశ్వరరావు, ట్రెజరీ సంఘం ఉద్యోగులు కొండయ్య, పంచాయతీ సెక్రటరీల సంఘం అధ్యక్షుడు అజయ్, జడ్పీ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు ప్రవీణ్, అభిషేక్, గిరిధర్ రావు, సత్యం అనీల్, నగేశ్ గౌడ్, బోనాల రవి, అజయ్, బాలాజీ, అంజయ్య, రమేశ్, వహీస్ పాల్గొన్నారు

సామాన్యుడిపై అధికారి బూతుపురాణం

- పథకాలకు అర్హుడిని కాదా? అన్నందుకు ఆగ్రహం
- సోషల్ మీడియాలో వైరల్

అలంపూర్ చౌరస్తా, జనవరి 28 : ప్రభుత్వ పథకాలకు తాము అర్హులం కాదా? అని అడిగినందుకు సామాన్యుడిపై ఓ అధికారి బూతుపురాణం అందుకున్నాడు. ఈ ఆడియో క్లిప్పింగ్ సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నది. జోగుళాంబ గద్వాల జిల్లా ఉండవల్లిలో ప్రభుత్వం ప్రారంభించిన పథకాలకు సంబంధించి లబ్ధిదారుల పేర్ల జాబితా గ్రామపంచాయతీ గోడకు అంటించారు. జాబితాలో తన పేరు లేదని స్థానికుడు రామకృష్ణ ఆందోళన చెందాడు. ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లేందుకు మండల పరిషత్ కార్యాలయానికి వెళ్లాడు. మధ్యాహ్నం 12 గంటలైనా ఎంపీడీవో రాకపోవడంతో సదరు వ్యక్తి ఫోన్‌లో మాట్లాడాడు. ‘నేను కులాంతర వివాహం చేసుకున్న.. నాకు సెంటు స్థలం, పొలం లేదు. ఇల్లు కూడా లేదు. అన్ని అర్హతలు ఉన్నా నాకెందుకు పథకాలు మంజూరు కాలేదు’ అని నిలదీశాడు. ఈ విషయంపై అడుగుదామని వస్తే అందుబాటులో లేరనడంతో అధికారి ఆగ్రహంతో యువకుడిపై తిట్టడం మొదలుపెట్టాడు. ఈ మాటలను ఆడియో రికార్డు చేసి సోషల్ మీడియాలో పోస్ట్ చేయడంతో వైరల్ అవుతున్నది. ఈ విషయమై ‘నమస్తే తెలంగాణ’ ఎంపీడీవోను వివరణ కోరగా.. ‘నేను పథకాలపై ప్రజలతో మాట్లాడుతుండగా వేరే వాళ్లు అన్న మాటలు వారికి ఫోన్‌లో వినిపించడంతో తప్పుగా అర్థం చేసుకున్నారు. నేను అలా మాట్లాడలేదు’ అని చెప్పారు.

నిర్బంధంలో ‘ఎన్టీపీసీ’ ప్రజాభిప్రాయ సేకరణ

- కోరుకంటి చందర్ సహా బీఆర్ఎస్ నాయకుల అరెస్ట్
- ప్రతిపక్షం, ప్రజలు లేకుండానే సమావేశం

మంచిర్యాల జిల్లా జైపూర్ పోలీస్‌స్టేషన్‌లో మాజీ ఎమ్మెల్యే చందర్‌తోపాటు బీఆర్ఎస్ మాజీ కార్పొరేటర్లు, బీఆర్ఎస్ నాయకులు

రామగుండం (జ్యోతినగర్), జనవరి 28: రామగుండం ఎన్టీపీసీలో ఫేజ్-2 కింద 2400 మెగావాట్ల సామర్థ్యంగల తెలంగాణ సూపర్ థర్మల్ పవర్ ప్రాజెక్టు స్థాపన కోసం మంగళవారం ఎన్టీపీసీలో చేపట్టిన ప్రజాభిప్రాయ సేకరణ భారీ బందోబస్తు మధ్య సాగింది. ఎన్టీపీసీ భూ నిర్వాసితుల పక్షాన న్యాయం కోసం పోరాడుతామని, నిర్వాసితుల సమస్యల పరిష్కారానికి హామీ ఇచ్చిన తర్వాతనే ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టాలని రామగుండం మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్ ఎన్టీపీసీ పట్టణ బంద్‌కు పిలుపునివ్వడంతో పోలీసులు ముందస్తుగా ప్రభావిత గ్రామాల్లోని బీఆర్ఎస్ నాయకులను హౌస్ అరెస్ట్ చేశారు. ప్రజాభిప్రాయ సేకరణ ప్రాంగణం గేట్ వద్ద తనిఖీలు చేపట్టారు. ప్రజాభిప్రాయ సేకరణకు వచ్చిన కోరుకంటి చందర్, నాయకులను గేట్ వద్దే అరెస్ట్ చేసి, జైపూర్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ప్రతిపక్ష నాయకులను అరెస్ట్ చేయడంతో ప్రజాభిప్రాయ సేకరణలో ప్రజల తరపున మాట్లాడే వారు లేకుండా పోయారు. ప్రజాభిప్రాయ సేకరణలో అరెస్టులు ఏంటని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

భూ నిర్వాసితులకు అండగా పోరాటం

ఎన్టీపీసీ విద్యుత్ ప్లాంటు కోసం భూములను త్యాగం చేసిన నిర్వాసితులకు అండగా ఉంటాం. న్యాయం జరిగే వరకు బీఆర్ఎస్ తరపున పోరాడుతాం. భూనిర్వాసితుల పక్షాన ఎన్టీపీసీ పట్టణ బంద్‌కు పిలుపునిచ్చాం. ప్రజాభిప్రాయ సేకరణలో నిర్వాసితుల గొంతుగా అభిప్రాయం వ్యక్తం చేసేందుకు వెళ్తున్న క్రమంలో అక్రమంగా అరెస్ట్ చేసి, పోలీస్ స్టేషన్‌లో నిర్బంధించారు. భూ నిర్వాసితుల కుటుంబాల జీవితాలను చీకటి మయం చేసిన ఎన్టీపీసీ యాజమాన్యం ప్రభావిత ప్రాంతాల అభివృద్ధికి నిధులు కేటాయించాలి. కాంట్రాక్ట్ కార్మికుల పిల్లలకు కార్పొరేట్ స్థాయిలో కేజీ నుంచి పీజీ వరకు ఉచిత విద్య అందించాలి. సూపర్ స్పెషాలిటీ దవాఖానను ఏర్పాటు చేయాలి. ప్రభావిత గ్రామాలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలి. నిర్వాసితుల డిమాండ్లను పూర్తిస్థాయిలో అమలు చేసేవరకు బీఆర్ఎస్ పోరాడుతూనే ఉంటుంది.

- కోరుకంటి చందర్, రామగుండం మాజీ ఎమ్మెల్యే